క్లుప్తంగా

హనుమంత వాహనంపై కల్యాణ వెంకట్రమణస్వామి

బైరెడ్డిపల్లి: పట్నపల్లె కొండపై వెలసిన శ్రీకల్యాణ వెంకట్రమణస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం స్వామి వారు హనుమంత వాహనంపై విహరించారు. ఉదయం ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేక పూజలు నిర్వహించారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ కళ్యాణవెంకట్రమణస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి హనుమంతు వాహనంపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆర్టీసీ ప్రయాణికులకు బహుమతులు



బహుమతులు అందుకున్న వారితో డీఎం సుధాకరయ్య

పుంగనూరు: పుంగనూరు ఆర్టీసీ డిపో నుంచి వెళ్లే బస్సుల్లో ప్రయాణించే వారికి లక్కీ డ్రా బహుమతులు అందజేశారు. శనివారం డీఎం సుధాకరయ్య ఆధ్వర్యంలో టికెట్ల డ్రా తీసి, ప్రయాణికులను ఎంపిక చేశారు. రాయచోటి, ముళబాగిల్, దొడ్డిపల్లె, తిరుపతి రూట్లలో ప్రయాణించిన వారిలో లాటరీ ద్వారా మనోహర్, నాగమణి, వెంకట్రమణ, రమణమ్మ, శ్రీనివాసులు, మునివెంకట, ఆకాష్, ఖాదర్‌వల్లి, రహమత్‌బిలకు బహుమతులు అందజేశారు. సురక్షిత ప్రయాణానికి ఆర్టీసీ బస్సుల్లోనే వెళ్లాలని కోరారు. ట్రాఫిక్ సూపర్‌వైజర్ సంధ్య, డిపో మెకానికల్ సూపరింటెండెంట్ రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వి.కోట వాసికి ఆంధ్రకేసరి పురస్కారం



పురస్కారం అందుకుంటున్న వెంకటరత్నం

వి.కోట: మండలంలోని సి.ఎల్లాగరం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు డాక్టర్ కోఠారి వెంకటరత్నంకు ఆంధ్రకేసరి జాతీయ పురస్కారం అందింది. శనివారం చిత్తూరులో భారతీయ తెలుగు రచయితల సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో కొఠారి వెంకటరత్నం రచించిన సత్యాగ్రహి కవితా సంపుటి కవితను ఆవిష్కరించారు. అందులోని కవితలను చదివి వినిపించారు. ఈసందర్భంగా ఆయనను సమాఖ్య పురస్కారం, శాలువా, ప్రసాంశపత్రంతో సన్మానించింది. గతంలోనూ ఈయన ఎన్నో కవితా సంపుటిలు రచించారు.

టీడీపీ రెచ్చగొట్టడం మానుకోవాలి

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన ఘటనకు టీడీపీ నేతలు రెచ్చగొట్టే ధోరణితో పార్టీ కార్యకర్తలను గొడవలకు పురిగొల్పడం తగదని స్థానిక ఎంపీటీసీ సభ్యుడు వెంకటరమణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ స్థానిక వైఎస్సార్ సీపీ నేత మణి వ్యవసాయం చేస్తున్న భూమిలో టీడీపీ కార్యకర్తలు వన్యప్రాణుల కోసం విద్యుత్ తీగలు అమర్చారని ఈ సందర్భంగా ఇరువర్గాల మధ్య జరిగిన ఘటనకు టీడీపీ నేతలు కావాలనే వైఎస్సార్ సీపీ నేతలు,కార్యకర్తలపై అవాస్తవాలతో ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఎన్నికల అనంతరం ప్రశాంతంగా ఉన్న గ్రామాల్లో టీడీపీ నేతలు కావాలనే గొడవలను సృష్టిస్తున్నారన్నారు. ఓటమి భయంతోనే టీడీపీ నేతలు రెచ్చిపోతున్నారని ప్రజలు భావిస్తున్నారని పేర్కొన్నారు.

గర్భిణులు జాగ్రత్తలు తీసుకోవాలి



ద్వారకాపురంలో వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రియాంక

తవణంపల్లె: గర్భిణులు రక్తహీనత రాకుండా జాగ్రత్తలు పాటించాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మండలంలోని ద్వారకాపురంలో శనివారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ ప్రియాంక రోగులకు వైద్య పరీక్షలు చేయించారు. అదే విధంగా బాలింతలు, గర్భిణులు, బీపీ, సుగర్‌వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేయించి మందులు అందజేశారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. ఆరోగ్య కార్యకర్తలు శ్రీనివాసులు, సుజాత, ఎంఎల్‌హెచ్‌పీ నిఖిల, విజయలక్ష్మి పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనాల పంపిణీ

ఐరాల: ప్రభుత్వం రైతులకు నాణ్యమైన సబ్సిడీ విత్తన వేరుశనగ పంపిణీ చేస్తుందని ఏఓ వరలక్ష్మి తెలిపారు. ఐరాల రైతు భరోసా కేంద్రంలో శనివారం రైతులకు విత్తన పంపిణీని ఏఓ ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్రతి రైతుకు సబ్సిడీ వేరుశనగ విత్తనాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వీఏఏ కావేరి పాల్గొన్నారు.

కబ్జాదారులకు కౌండిన్య కల్పతరువు

- కౌండిన్య నదిని వదలని రైతులు
- సాగుభూముల్లో కలుపుకుంటున్న వైనం
- ఇసుక అమ్మకాల కోసం కొందరు కబ్జా
- ఆక్రమణలపై స్పందించని రెవెన్యూ



చిన్నపేట కురపల్లె వద్ద ఆక్రమణకు గురైన కౌండిన్య నది(ఫైల్)

పలమనేరు నియోజకవర్గంలో మూడు మండలాల వరప్రసాదిని కౌండిన్య నది కబ్జా కోరల్లో చిక్కుకుంది. నదిని కాపాడాల్సిన అధికారుల నిర్లక్ష్యం అక్రమార్కులకు అదునుగా మారింది. నదికి ఆనుకుని ఉన్న వందలాది ఎకరాల భూములు ఇప్పటికే ఆక్రమణకు గురికాగా.. ఈ తంతు ప్రస్తుతం మళ్లీ ఎక్కువైంది. అధికారులు సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉండడం, రాష్ట్రంలో ప్రభుత్వపాలన కాకుండా ఎన్నికల కమిషన్ ఆధీనంలో ఉండడంతో పోలీసు, రెవెన్యూశాఖలు స్తబ్దుగా ఉంటున్నాయి. అడిగేవారే లేక పోవడంతో కొందరు నెలరోజులుగా కౌండిన్యలో యథేచ్ఛగా ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇసుక అక్రమ రవాణా జోరందుకుంది.

పలమనేరు: కౌండిన్య నది భూములు ఆక్రమణకు గురవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. నియోజకవర్గంలోని పెద్దపంజాణి, గంగవరం, పలమనేరు మండలాల మీదుగా సుమారు 45 కిలో మీటర్ల మేర కౌండిన్య నది ప్రవహిస్తోంది. వర్షాకాలంలో నదిప్రవహిస్తే మూడేళ్లపాటు ఈ ప్రాంతంలో సాగునీటి సమస్యలుండవు. భూగర్భజలాలు పెరిగి పంటలకు అనుకూలంగా ఉంటుంది. నియోజకవర్గంలోనే సాగునీటికి ఈ నదొక్కటే ఆధారంగా ఉంది. నదిలో ఇప్పటికే ఇసుకను తరలించేశారు. ఇసుకాసురుల దెబ్బకు నదికి ఉరువైపులా ఉన్న వృక్షాలు సైతం నేలకొరిగాయి. దీంతో నది ఎడారిలా మారింది. మరోవైపు నదికి ఆనుకుని భూములున్న రైతులు కొద్దికొద్దిగా తమ సాగుభూముల్లో కలుపుకుంటూ ఆక్రమిస్తున్నారు. రెవిన్యూ లెక్కల ప్రకారం నది వెడల్పుకు ఇప్పుడున్న నది వెడల్పుకు భారీ వ్యత్యాసం కనిపిస్తోంది. దాదాపు 110 ఎకరాల దాకా నదికి చెందిన భూములు ఆక్రమణలకు గురైనట్టు తెలుస్తోంది.

ఇసుక అమ్మకాల కోసం

ప్రస్తుతం ఇసుకకు భారీ డిమాండ్ ఉంది. ఇప్పటికే నదిలోని ఇసుక నిల్వలు 80శాతం ఖాళీ అయ్యాయి. దీంతో ఇసుక స్మగ్లర్ల కన్ను నదికి ఆనుకుని ఉన్న భూములపై పడింది. దీన్ని క్యాష్ చేసుకోవాలనే ఆలోచనతో నదికి ఇరువైపులా పట్టా, లేదా ధరఖాస్తు భూములున్న రైతులు తమ పొలాల్లోకి నదీ తీరాన్ని కలిపేసుకుంటున్నారు. ఆపై ఇసుక కలిగిన ఈ భూములను ఎకరా రూ.5లక్షల వరకు ఇసుకాసురులకు విక్రయిస్తున్నారు. రైతులు. ఇసుకాసురు ఇసుకాసురులు పక్కా స్కెచ్‌తో కబ్జాల పర్వం సాగిస్తున్నారు. దీనిపై మైనింగ్, రెవెన్యూ, సెబ్, ఇరిగేషన్ శాఖలు స్పందించాల్సిన అవసరం ఉంది.

నేత్రపర్వం.. ముత్యాలపల్లకి సేవ



ముత్యాలపల్లకిపై అమ్మవారి ఊరేగింపు

గుడుపల్లె: మండలంలోని యామగానిపల్లెలో శ్రీద్రౌపదీ ధర్మరాజస్వామి ఆలయ మహా భారత మహోత్సవాల్లో భాగంగా శనివారం ముత్యాలపల్లకి సేవ నయనానందకరంగా సాగింది. ఉదయం ఆలయంలో విశేష పూజలు జరిగాయి. చుట్టపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యల విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. రాత్రి అమ్మవారి ఉత్సవమూర్తిన సర్వాంగ సుందరంగా అలంకరించి ముత్యాలపల్లకిపై కొలువుదీర్చి మంగళవాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. ఆలయ ఆవరణలో కీచక వధ నాటక ప్రదర్శన జరిగింది.

నేడు రథోత్సవం

మహోత్సవాల్లో భాగంగా ఆదివారం రథోత్సవం, అర్జునుడు ఆవుల మళ్లింపు కార్యక్రమాలు ఉంటాయని ఆలయ పాలకులు తెలిపారు. చుట్టుపక్కల గ్రామాలకు చెందిన వారు పశువులను తీసుకుని వచ్చి ఆలయం వద్ద పూజలు చేసుకునేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి



సదుం స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

సదుం: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి జిల్లా ఎస్పీ మణికంఠ సూచించారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. స్టేషన్ పరిధి, భౌగోళిక పరిస్థితులు, సమస్యాత్మక గ్రామాల వివరాలను ఆరా తీశారు. కౌంటింగ్‌ను దృష్టిలో ఉంచుకుని శాంతిభద్రతల పర్యవేక్షణలో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తనిఖీలు నిర్వహించి బాణసంచా, సరైన పత్రాలు లేని వాహనాలను సీజ్ చేయాలన్నారు. పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరు, వివిధ రికార్డులను పరిశీలించారు. ఎస్‌ఐ షేక్‌షావలి, సిబ్బందికి సూచనలిచ్చారు.

ఉపాధిలో భూగర్భ జలాల పెంపు పనులు



కూలీలతో మాట్లాడుతున్న పీడీ రాజశేఖర్

పెద్దపంజాణి: జాబ్ కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి ఉపాధి హామీ పథకం కింద పనులు కల్పించాలని సిబ్బందిని డ్వామా పీడీ రాజశేఖర్ ఆదేశించారు. శనివారం మండలంలోని నాగిరెడ్డిపల్లె, రాయలపేట పంచాయతీల్లో ఉపాధి హామీ పనులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కూలీల హాజరు పట్టికను పరిశీలించి, సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఉదయం, సాయంత్రం వేళల్లో పనులు చేపట్టాలని సూచించారు. రోజు వారి వేతనం గరిష్టంగా రూ.300 వరకూ పొందే అవకాశం ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని కూలీలకు చెప్పారు. ఫారంపాండ్, ఫీడర్ చానళ్లతో పాటు భూగర్భ జలాలు పెంచే పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. కొత్తగా చేపట్టే పనులకు ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. పండ్ల తోటల పెంపకం చేపట్టదలచిన రైతులు క్షేత్ర స్థాయి సిబ్బందిని సంప్రదించాలని సూచించారు. ఏపీడీ సునీల్, ఏపీఓ చిన్నరెడ్డెమ్మ, జేఈ నాగమణి, టీఏ దేవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవం



బొమ్మాయిపల్లెలో విశేషాలంకారంలో వీరబ్రహ్మేంద్రస్వామి, గోవిందమాంబ

బంగారుపాళెం: మండలంలోని బొమ్మాయిపల్లెలో శనివారం జగద్గురు, కాలజ్ఞాని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వాహకులు వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ఉదయం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి వారి మూలవర్లకు అభిషేకాలు, పూజలు చేపట్టారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వధూవరులుగా అంకరించి పెళ్లిపీటలపై కొలువుదీర్చారు. వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా గోవిందమాంబ వీరబ్రహ్మేంద్రస్వామి వారి వివాహ వేడుకను భక్తుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణోత్సవాన్ని తిలకించి పునీతులయ్యారు. మధ్యాహ్నం మాజీ సర్పంచ్ నీరజాక్షులుగౌడ్, గంగాధరంగౌడ్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. స్వామివారి కల్యాణోత్సవానికి ఆలయ ధర్మకర్తలు శారద, మల్లయ్య, కనకమ్మ, గోవిందస్వామి, గ్రామస్తులు ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పట్టాభి, మునస్వామి, నారాయణస్వామి, రవి, రమేష్ పాల్గొన్నారు.

టీకాలతో క్షయ వ్యాధి నివారణ



టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

పాలసముద్రం: క్షయ వ్యాధికి భయపడాల్సిన అవసరం లేదని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. శనివారం మండలంలో మూడు బృందాలుగా బీసీసీ టీకాలు వేశారు. బొమ్మరాజుపురం ఆదిఆంధ్రవాడలో సూపర్‌వైజర్ సుశీల క్షయవ్యాధి నిర్మూలకు టీకాలు వేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం క్షయ వ్యాధి నిర్మూలనే ధ్యేయంగా 60 ఏళ్లు ఉన్న వయోజనులకు టీకాలు వేయడం ద్వారా సమాజంలో కొత్తగా క్షయవ్యాధి బాధితుల సంఖ్యను తగ్గించే దిశగా కృషిచేస్తున్నట్లు తెలిపారు. టీకాలతో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. అనంతరం టీకాలు వేశారు. ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో ఇద్దరికి గాయాలు

సదుం: విద్యుత్ షాక్‌తో ఇద్దరు గాయపడ్డ సంఘటన మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. బాధితుని కుటుంబ సభ్యుల కథనం మేరకు.. ఈనెల 23న రాత్రి జోగివారిపల్లె పంచాయతీ పాతపేటకు చెందిన దేవేంద్ర కుమారుడు మహేష్ స్నేహితుడు దేవాతో కలిసి చెరుకువారిపల్లెలో ఉన్న తమ మామిడి తోట వద్దకు బయలుదేరారు. నడుచుకుని వెళ్తుండగా మార్గమధ్యంలో అదే గ్రామానికి చెందిన కొందరి మామిడి తోటల వద్ద అడవి జంతువుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు తగిలి షాక్‌తో తీవ్రంగా గాయపడ్డారు. వీరికి సదుం సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేస్తున్నట్లు మహేష్ తండ్రి దేవేంద్ర శనివారం తెలిపారు.

వేడుకగా సీతారామ కల్యాణోత్సవం



ప్రత్యేకాలంకరణలో స్వామి,అమ్మవారు

సదుం: మండలంలోని పొట్టింవారిపల్లెలోని శ్రీసీతారామ స్వామి ఆలయంలో శనివారం రాత్రి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పుణ్యాహ వచనం, గణపతి పూజ, హోమాలు, ప్రత్యేక పూజలు జరిగాయి. ఉత్సవ మూర్తులను పుష్పపల్లకిపై గ్రామంలో ఊరేగించారు. భక్తులకు ఆలయం వద్ద అన్నదానం చేశారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలసుందరం రెడ్డి మృతి



బాలసుందరం రెడ్డి(ఫైల్)

పలమనేరు: జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలసుందరం రెడ్డి(85) శనివారం అనారోగ్యంతో వేలూరు సీఎంసీలో చికిత్సపొందుతూ మృతి చెందారు. గతంలో ఆయన మార్కెఫెడ్, స్టేట్ హౌసింగ్ బోర్డు సభ్యుడిగా పనిచేశారు. టీడీపీ పలమనేరు మండల అధ్యక్షుడిగా దశాబ్దకాలం సేవలందించారు. మాజీ ఎంపీ రామకృష్ణారెడ్డికి, ఆయన తనయుడు, మాజీ మంత్రి అమర్‌నాథ రెడ్డికి రాజకీయ సలహాదారుగా పనిచేశారు. గత కొంత కాలంగా కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతూ వేలూరు సీఎంసీలో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఆయన అంత్యక్రియలను ఆదివారం నిర్వహించనున్నట్టు అల్లుడు కృష్ణమూర్తి రెడ్డి తెలిపారు. ఆయన మృతికి స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడతో పాటు పలు పార్టీల నాయకులు సంతాపాన్ని తెలిపారు.

బాణసంచా విక్రయిస్తే క్రిమినల్ కేసులు



విక్రేతలతో మాట్లాడుతున్న సీఐ లక్షుమయ్య

బంగారుపాళెం: మండలంలో బాణసంచా విక్రయిస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సిఐ లక్షుమయ్య అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం ఆయన బాణసంచా విక్రేతలతో సమావేశాన్ని నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో టపాకాయలు కాల్చడం, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించడం, గుంపులు గుంపులుగా జనం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. పెట్రోల్ బంకుల్లో బాటిళ్లలో పెట్రోల్ పట్టరాదని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

రమణీయం.. కోనేటిరాయుని పుష్పయాగం



కోనేటి రాయస్వామికి పుష్పయాగం నిర్వహిస్తున్న వేద పండితులు

చామంతి, గన్నేరు, మొగలి, సంపంగి, జాజి, రోజా, తామర, మల్లి, వృక్షి, కనకాంబరాలతో పాటు బిల్వ పత్రం, తులసి, పన్నీరు ఆకులతో శ్రీకోనేటిరాయస్వామికి శనివారం పుష్పయాగం నయనానందకరంగా సాగింది. అశేష సంఖ్యలో భక్తులు పుష్పార్చనను వీక్షించి తరించారు.

గంగవరం: మండలంలోని కీలపట్లలో టీటీడీ అనుబంధ ప్రసిద్ధ శ్రీకోనేటిరాయస్వామి ఆలయంలో శనివారం పుష్పయాగం అత్యంత వైభవంగా జరిగింది. వార్షిక బ్రహ్మోత్సవాలు ముగిసిన మరుసటి రోజు పుష్పయాగం నిర్వహించడం ఆనవాయితీ. తెల్లవారు జామున ఆలయం ప్రత్యేక పూజలు జరిగాయి. 8గంటలకు శ్రీదేవి,భూదేవి సమేతంగా కోనేటిరాయస్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులు అడుగడుగునా కర్పూర నీరాజనాలు సమర్పించారు. సాయంత్రం ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి ఆలయంలోని ప్రత్యేక కల్యాణ వేదికపైకి వేంచేపు చేశారు. అనంతరం వేద మంత్రోచ్ఛారణలు, మంగళవాయిద్యాల నడుమ పరిమళభరిత పుష్పాలు, విశేష పత్రాలతో స్వామి, అమ్మవార్లను అర్చించి, మహామంగళ హారతులు ఇచ్చారు. అశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో అర్చక, పరిచారకులు, అధికార, అనధికారుల, భక్తుల కారణంగా తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా పత్రపుష్పయాగం నిర్వహిస్తారని అర్చకులు తెలిపారు. కంకణంబట్టార్ ఏకే నరసింహాచార్యులు ఆధ్వర్యంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవోపేతంగా జరిగాయి. ఈ ఉత్సవాల్లో టీటీడీ డిప్యూటి ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ గజేంద్ర పాల్గొన్నారు.



పుష్పయాగాన్ని వీక్షిస్తున్న భక్తజనం

కార్డెన్ సెర్చ్‌లో 18 వాహనాలు స్వాధీనం



గ్రామస్తులకు సూచనలు ఇస్తున్న సీఐ లింగప్ప

వి.కోట: మండలంలోని బోడిగుట్లపల్లెలో శనివారం నిర్వహించిన కార్డెన్‌సెర్చ్‌లో ఎలాంటి రికార్డులు లేని 18 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ లింగప్ప తెలిపారు. శనివారం ఉదయం బైరెడ్డిపల్లె ఎస్‌ఐ కృష్ణయ్య, 20 మంది సిబ్బందితో కలసి బోడిగుట్లపల్లెలో సీఐ కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. అనుమానితుల ఇళ్లలో సోదాలు చేశారు. ఎలాంటి రికార్డులు లేని 18 ద్విచక్ర వాహనాలను గుర్తించి స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఒక్క సారిగా పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించడంతో ప్రజలు హడలిపోయారు. ఈసందర్భంగా గ్రామస్తులతో సీఐ మాట్లాడుతూ నేరాల నియంత్రణకు, అసాంఘిక కార్యాకలపాలకు అడ్డుకట్టు వేసేందుకు ప్రజలు సహకరించాలని సీఐ కోరారు. సమస్యాత్మక గ్రామాలు తమ ఆధీనంలో ఉన్నట్లు ఆయన తెలిపారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. అనవసరంగా గొడవలు చేసుకుని కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. గ్రామంలో అనుమానితులు సంచరిస్తుంటే వెంటనే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. సోదాల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలకు సంబంధించి ఒరిజినల్ రికార్డులు చూపించి తిరిగి పొందవచ్చని తెలిపారు.

ర్యాలీలకు అనుమతి లేదు

రొంపిచెర్ల: సార్వత్రిక ఎన్నికల ఫలితాల విడుదల సమయంలో ర్యాలీలు, ఊరేగింపులకు ఎలాంటి అనుమతి లేదని కల్లూరు సీఐ శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జూన్ 4వ తేదీన ఎన్నికల ఫలితాల విడుదల అనంతరం ఎవరు కూడా విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించకూడదని చెప్పారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బాణసంచా వ్యాపారులు జూన్ 6వ తేదీ వరకు విక్రయాలు ఆపేయాలని చెప్పారు. పెట్రోల్ బంకుల వారు వాహనాలకు మాత్రమే పెట్రోల్ పట్టాలన్నారు. మద్యం దుకాణాల వద్ద ఎక్కడా గాజు సీసాలు నిల్వ ఉండకూడదని తెలిపారు. ఎన్నికల ఫలితాల అనంతరం యువత గొడవలకు వెళ్లి జీవితాలను నాశనం చేసుకోకూడదని సీఐ తెలిపారు. రద్దీ ప్రదేశాల్లో ప్రజలు ఎవరు గుంపులు గుంపులుగా ఉండకూడదని సూచించారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా



మాట్లాడుతున్న ఎస్‌ఐ సుకుమార్

రొంపిచెర్ల: వాహనదారులు నిబంధనలు అతిక్రమిస్తే భారీ జరిమానా విధిస్తామని ఎస్‌ఐ సుకుమార్ తెలిపారు. శనివారం రొంపిచెర్ల పోలీసు స్టేషన్‌లో వాహనాల డ్రైవర్లకు రహదారి నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకపోతే రూ.5000, మైనర్లు వాహనాలు నడిపితే రూ. 25 వేలు, ఏడాది జైలు శిక్ష, మద్యం సేవించి వాహనాలు నడిపితే మొదటి సారి రూ.10 వేలు, ఒక సంవత్సరం జైలు శిక్ష, రెండవ సారి పట్టుబడితే రూ.15వేలు, మూడు సంవత్సరాలు జైలు శిక్ష, అతి వేగంగా వాహనాలు పడిపితే రూ.5 వేలు, పర్మిట్ లేకుంటే రూ.10 వేలు, సీటు బెల్ట్ పెట్టుకోక పోతే రూ.1000, హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే రూ.1000, అత్యవసర వాహనాలకు దారి ఇవ్వకపోతే రూ.10వేలు జరిమానా, పబ్లిక్ ప్రాంతాలలో వాహనాలు పెడితే రూ.1000 జరిమాన విధిస్తామని చెప్పారు. వాహనదారులు జాగ్రత్తగా వామనాలను నడపాలన్నారు.

రేపటి నుంచి వజ్రాలపురం గంగమ్మ జాతర



సమావేశంలో మాట్లాడుతున్న కమిటీ సభ్యులు

బంగారుపాళెం: మండలంలోని వజ్రాలపురంలో వెలసిన శక్తి స్వరూపిణి శ్రీవజ్రాలపురం బోయకొండ గంగమ్మ జాతర ఈ నెల 27వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు. ఆలయం ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ధర్మకర్తలు రాధమ్మ, కృష్ణప్ప మాట్లాడుతూ, ఈ నెల 27వ తేదీ నుంచి 29 వరకు అమ్మవారి జాతర మూడు రోజుల పాటు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జాతర కార్యక్రమంలో భాగంగా 27వ తేదీ సోమవారం అభిషేకం, కలశస్థాపన, చండీహోమం, మధ్యాహ్నం అన్నదానం, భజన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 28వ తేదీ మంగళవారం ఉదయం అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అంబలి, పొంగళ్లు సమర్పణ, మధ్యాహ్నం అన్నదానం, అమ్మవారిని దర్శించుకున్న మహిళలకు అమ్మవారికి అభిషేకించిన పసుపు, కుంకుమ, జాకెట్టు అందజేయనున్నట్లు తెలిపారు. సాయంత్రం 7.30 గంటలకు అన్నమయ్య సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయన్నారు. 29వ తేదీ బుధవారం ఉదయం అమ్మవారి ప్రత్యేక అలంకరణ, పూజలు, సాయంత్రం 4 గంటలకు అమ్మవారిని విశేషంగా అలంకరించి వెండితేరుపై కొలువుదీర్చి అమ్మవారి సన్నిధి నుంచి ఊరేగింపు, నిమజ్జన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు వివరించారు. ఎన్నికల నియమావళిని అనుసరించి జాతర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అమ్మవారి జాతరలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. సమావేశంలో నిర్వాహకులు గోపి, పురుషోత్తం, ఈశ్వర్‌నాయుడు, కమిటీ సభ్యులు శివలింగయ్య, బుస్సానాగరాజగౌడ్, రాజేంద్రనాయుడు, రామూర్తినాయుడు, సుబ్బా నాయుడు, బుజ్జి, శంకరయ్య, మురళి, తులసీ వేణుగోపాల్‌నాయుడు, పట్టాభి, బాబు, ఆలయ మేనేజర్ మొగిలప్ప తదితరులు పాల్గొన్నారు.